క్లుప్తంగా

గ్రామాల్లో ఫైలేరియా సర్వే



రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఏర్పేడు: మండలంలోని అంజిమేడు ఎస్సీ కాలనీలో ఏర్పేడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ఫైలేరియా సర్వే నిర్వహించారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి కుటుంబంలోని ప్రతి ఒక్కరికి రక్త పరీక్షలు నిర్వహించారు. సేకరించిన రక్తాన్ని ల్యాబ్‌కు పంపి రోగ నిర్ధారణ చేసి మందులు అందజేయనున్నట్లు డాక్టర్ శివ ప్రియ తెలిపారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ సుబ్బరాయుడు, సీహెచ్‌ఓ సౌజన్య, ఏఎన్ఎం వల్లెమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

పాకాల: ఎమ్మార్సీ కేంద్రం వద్ద ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ డైరీ, క్యాలెండర్‌ని ఎంఈఓ బాబ్జీ, ఎంఈఓ-2 లింగయ్య చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శుక్రవారం యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై నిత్యం పోరాడుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ కోశాధికారి పత్తిపాటి రమేష్ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి గుడిపల్లి శ్రీధర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు ఎం.మోహన్, కోశాధికారి రమేష్, బాలసుబ్రమణ్యం, రాజేష్, మురళీధర్, తులసీ, కుసుమ, ధనలక్ష్మి, రజనీప్రియ, ఈశ్వర్‌నాయుడు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కోసం ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి అర్జీ అందజేస్తున్న పరశునాథ్

ఏర్పేడు: ఎమ్మెల్యే కోటాలో వ్యవసాయ ట్రాక్టర్‌ను అందించాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి శుక్రవారం మండలంలోని చింతలపాలెం పంచాయతీ పరిధి మరాఠీపురం షికారీల సంఘం నాయకుడు పరశునాథ్, షికారీలు విన్నవించారు. తమకున్న వ్యవసాయ భూములు సాగు చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. శ్రీకాళహస్తిలో శుక్రవారం ఎమ్మెల్యేను కలిసి అర్జీ అందజేశారు.

అమ్మవారి సేవలో నటి శ్యామల



తిరుచానూరు(చంద్రగిరి): శ్రీపద్మావతి అమ్మవారిని సినీ నటి శ్యామల కుటుంబ సభ్యులతో కలసి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆమెకు ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

తిరుమల ఏఎస్పీగా శివరామిరెడ్డి

తిరుపతి క్రైమ్: తిరుమల ఏఎస్పీగా శివరామిరెడ్డి నియమిస్తూ రాష్ట్ర డీజీపీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గతంలో టీటీడీ ఏవీఎస్ఓగా, తిరుమల డీఎస్పీగా కూడా పనిచేశారు. ఇదిలా ఉంటే తిరుమల ఏఎస్పీగా ఉన్న మునిరామయ్య బదిలీ అవడంతో గత కొంత కాలంగా ఖాళీగా ఉంది.

భక్తితత్వాన్ని నలుదిశలా వ్యాప్తి చేయాలి

తిరుపతి సిటీ: భక్తితత్వాన్ని నలు దిశలా వ్యాప్తి చేయాలని టీటీడీ జేఈఓ సదాభార్గవి పిలుపునిచ్చారు. శుక్రవారం ఎస్వీ ఆర్ట్స్ కళాశాల సమావేశ మందిరంలో శ్రీమహాభాగవతం-భక్తితత్వం అనే అంశంపై రెండు రోజులపాటు జరిగే జాతీయ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా సనాతన ధర్మాన్ని ప్రచారం చేయాలన్నారు. టీటీడీ డీఈఓ ఎం.భాస్కరరెడ్డి మాట్లాడుతూ శ్రీవారి సంస్థల్లో విద్యనభ్యసిస్తున్న యువత మహాభాగవతాన్ని చదివి భక్తిభావాన్ని అలవర్చుకోవాలన్నారు. మహాభాగవతం సంపుటిని అతిథులు ఆవిష్కరించారు. బెంగళూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ కొలకలూరి ఆశాజ్యోతి విద్యార్థులకు మహాభాగవతంలోని కీలక అంశాలను వివరించారు. జేఈఓ సదాభార్గవిని సదస్సుకు హాజరైన అతిథులను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ నారాయణమ్మ, ఎస్వీ డబ్ల్యూ కళాశాల ప్రిన్సిపల్ మహదేవమ్మ, ఎన్ భీమన్న, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

క్రీడాకారుల ప్రతిభకు ప్రోత్సాహం



సత్యవేడు: మదనంబేడులో ఖో-ఖో ఆడుతున్న క్రీడాకారులు

సత్యవేడు: ×ఆడుదా ఆంధ్రా× క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందని సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏఈవీఎం బాలాజీ రెడ్డి అన్నారు. శుక్రవారం దాసుకుప్పం సచివాలయ పరిధిలో క్రీడాపోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మదనంబేడు, దాసుకుప్పం పంచాయతీలలో నిర్వహించిన బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ పోటీలలో 17 టీమ్‌లు పాల్గొన్నాయి, మొత్తం 192 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ కే. రవి తదితరులు పోటీలను పర్యవేక్షించారు. పీడీలు మురళి, సతీష్, మణి, అపర్ణ, స్వర్ణ, ఢిల్లీరాణి, కె.గ్రేస్ ప్రతిమ, పయనిబాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్ద పాండూరు, మరదవాడ గ్రామ సచివాలయాల పరిధిలో క్రీడా పోటీలను ప్రారంభించారు. తొలుత క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. క్రీడా స్ఫూర్తితో అందరూ ఆడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, ఆడుదాం ఆంధ్ర మండల కో-ఆర్డినేటర్ బందిల కుమార్, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ అంకమ్మ, సర్పంచ్ కవిత తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం: స్థానిక వెళ్లూరు దగ్గర పాత కాలేజీ గ్రౌండ్‌లో శుక్రవారం ఆడుదాం ఆంధ్రా పోటీలలో ఎంపీపీ సింధు క్రికెట్ పోటీలను లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు చిన్నదొరై, పీడీ బాబు, నాయకులు దేశప్పన్, ధనరాజ్, చిరంజీవి మహేష్, ఉదయ కుమార్, అలగేశన్, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, రాజేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం-ఆంధ్రా

ఏర్పేడు: ఆడుదాం-ఆంధ్రా క్రీడల పోటీలు నాలుగో రోజైన శుక్రవారం ఉత్సాహంగా సాగాయి. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల నైపుణ్యాలను వెలికితీసేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టడం తెలిసిందే. మండలంలోని పల్లం, పాపానాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం-ఆంధ్రా క్రీడలను నిర్వహించారు. క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ తదితర క్రీడల్లో గ్రామీణ యువత పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.



వాలీబాల్ పోటీల్లో బాలికలు



పాఠశాల ఆవరణలో కబడ్డీ ఆడుతున్న యువత



పల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఖోఖో ఆడుతున్న బాలికలు







సత్యవేడు: వాలీబాల్ పోటీలో క్రీడాకారులు, నాగలాపురం: క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ సింధు, వరదయ్యపాళెం: పాండూరులో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి వినుతకు లేదు



సెన్నీరు కుప్పం శేఖర్

శ్రీకాళహస్తి: ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని విమర్శించే స్థాయి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుతకు లేదని టెలికాం అడ్వైజరీ కమిటీ డైరెక్టర్ సెన్నీరు కుప్పం శేఖర్ అన్నారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో బలిజలకు ఎమ్మెల్యే పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. శ్రీకాళహస్తీశ్వరాలయ చైర్మన్ బలిజ కులస్తుడు కాదా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు, కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంకు చైర్మన్ పాలకమండలిలో నలుగురు సభ్యులు ఇలా చాలామందికి ఎమ్మెల్యే అవకాశం ఇచ్చారని చెప్పారు. బలిజ భవనం నిర్మాణం కోసం ఎమ్మెల్యే రూ.కోటి ప్రకటించారని గుర్తుచేశారు. వినుత కూడా రూ.కోటి ప్రకటిస్తే రేపు పనులు మొదలుపెట్టడానికి సిద్ధమేనని చెప్పారు. వంగవీటి మోహనరంగ విగ్రహావిష్కరణ చేసే అర్హత ఎమ్మెల్యేకు ఉందా అని వినుత ప్రశ్నించడం హాస్యాస్పదంగా ఉందని చెప్పారు. అసలు ఆ మాట చెప్పడానికి అర్హత ఉందా అని కౌంటర్ విసిరారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఏ ఎమ్మెల్యే చేయని విధంగా అన్ని రకాల ముఖ్యమైన పదవుల్లో బలిజలకు అవకాశం కల్పించిన ఘనత ఎమ్మెల్యేకే దక్కిందన్నారు. వంగవీటి మోహనరంగ విగ్రహం పెట్టడానికి ప్రభుత్వం నుంచి అనుమతి ఇప్పించారు. భవన నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పినట్లు పేర్కొన్నారు. ఇంత చేస్తున్న ఎమ్మెల్యేను విమర్శించడం మానుకోవాలని హితవు పలికారు.

ప్రజల భాగస్వామ్యంతో పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక

సత్యవేడు: ప్రజల భాగస్వామ్యంతో పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక 9 అంశాలతో రూపొందించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం 2024-25 ఆర్థిక సంవత్సరంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక తయారీపై పంచాయతీరాజ్ అడిషనల్ కమిషనర్ సుధాకర్ విజయవాడ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ,17 సచివాలయ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు హాజరయ్యారు. ఎంపీడీఓ మాట్లాడుతూ, స్థానిక అవసరాలు దృష్టిలో ఉంచుకుని గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక తయారు చేయాలన్నారు. గ్రామ సభలోఇది ఆమోదం పొందాలన్నారు. ప్రతి పంచాయతీలో 5 కార్యాచరణ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ ప్రణాళికను ఈ గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓ పీఆర్డీ ముని రవికుమార్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

జగనన్నతోనే ఆరోగ్య రక్ష సాధ్యం



కొత్త ఆరోగ్యశ్రీ కార్డును అందజేస్తున్న సుమన్‌కుమార్ తదితరులు

నారాయణవనం: రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి రక్షణ కల్పించి, అండగా నిలబడి భరోసా కల్పించడం జగనన్నతోనే సాధ్యమైందని జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్ పేర్కొన్నారు. రూ. 25 లక్షల ఆరోగ్య శ్రీ నూతన కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. శుక్రవారం మండలంలోని పాలమంగళం ఉన్నత పాఠశాల ఆవరణలో పాలమంగళం సౌత్ సచివాలయ పరిధిలోని మహిళలకు ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. పేదలకు కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా వైద్యం పొందడానికి ఆరోగ్యశ్రీని దివంగత సీఎం రాజశేఖరరెడ్డి ప్రారంభిస్తే, ఆయన తనయుడు సీఎం జగనన్న ఆరోగ్యశ్రీ వైద్య పరిమితిని 5 లక్షల నుంచి 25లక్షల వరకు పెంచడంతో పేదల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి దర్శిత్ రాజ్, డాక్టర్ రాగసుధ, సర్పంచులు సాయిరవి, ప్రేమలత, ఎంఈఓ ప్రభాకర్‌రాజు, సీహెచ్ఓ శ్రీనివాసులు, మహిళలు, పార్టీ శ్రేణులు, సచివాలయ, ఆరోగ్య శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా విద్యుత్ తీగలు

- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు



పెద్ద పాండూరు-తొండంబట్టు మార్గంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ తీగలు

వరదయ్యపాళెం: మండలంలోని పెద్ద పాండూరు-తొండంబట్టు ప్రధాన రోడ్డు మార్గంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో కుప్పటతాగేలి సమీపంలో రోడ్డుకు అడ్డంగా విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు వేలాడుతుండడంతో గమనించని వాహనదారులు రాత్రి పూట అవి తగులుకుని ప్రమాదాలకు గురవుతున్నారు. అయితే ఆ తీగల్లో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. ఇకనైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని కోరుతున్నారు.

మహిళా సాధికారతే బ్యాంకు లక్ష్యం



విద్యార్థినులకు స్పోర్ట్స్ కిట్లను అందిస్తున్న బ్యాంకు ప్రతినిధులు

తిరుపతి(అలిపిరి): మహిళా సాధికారతే యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన లక్ష్యమని.. ప్రతిఒక్కరూ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ రాంప్రసాద్ అన్నారు. శుక్రవారం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొననున్న విద్యార్థినులకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంపవర్ హర్ (మహిళా సాధికారత) సీఎస్ఆర్ యాక్టివిటీ కింద స్పోర్ట్స్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో శ్రీపద్మావతీ మహిళా యూనివర్సిటీ వీసీ డి.భారతి, ఫిజికల్ ఎడ్యుకేషన్ డీన్ సరోజిని, బ్రాంచ్ మేనేజర్ పుష్పాంజలి, ఎంపవర్ హర్ జోనల్ మెంబర్ సంకటి స్వాతి, రీజనల్ మెంబర్స్ నిహీలా, కె.స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఐదు తరగతులు.. ఒకటే గది!

- చిన్న పాండూరులో ఆరుబయట విద్యార్థుల అవస్థలు
- విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యానికి నాడు-నేడులో మంజూరు కాని అదనపు భవనం



చిన్న పాండూరు ప్రాథమిక పాఠశాలలో ఆరుబయట నిర్వహిస్తున్న తరగతులు

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 53 మంది విద్యార్థులకు ఒకే తరగతి గది ఉంది. దీంతో పిల్లలకు ఒకే తరగతి గదిలో విద్యాబోధన చేయలేక ఆరుబయట తరగతులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. ఒకటి నుంచి 5 వరకు ఉన్న ప్రాథమిక పాఠశాలలో కొన్నేళ్లుగా 50 మంది పైచిలుకు విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. రెండవ విడత నాడు-నేడుకు ఈ పాఠశాల ఎంపికైనప్పటికీ అందులో తరగతి గది మంజూరు కాలేదు. స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారుల సమన్వయంతో నాడు-నేడుకు పాఠశాలలో చేపట్టాల్సిన కల్పించాల్సిన వసతులు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రభుత్వానికి నివేదించాల్సి ఉంది. ప్రభుత్వానికి నివేదించిన సమయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగానే పాఠశాలకు అదనపు తరగతి గది మంజూరుకాలేదు. ప్రధానంగా వర్షాకాలం వస్తే అందరికీ ఒకే గదిలో తరగతులు నిర్వర్తించడం, పాఠ్యాంశాలు బోధించడం అసాధ్యమవుతుందని పాఠశాల ఉపాధ్యాయులు వాపోతున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి అదనపు తరగతి గది మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

'నూతనం'గా హద్దుమీరొద్దు!

తొట్టంబేడు(శ్రీకాళహస్తి) : నూతన సంవత్సర సంబరాల్లో భాగంగా డిసెంబర్ 31వ తేదీ రాత్రి హద్దు దాటి అతిగా ప్రవర్తించేవారిపై చర్యలు తప్పవని ఎస్ఐ రాఘవేంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీల పేరుతో రోడ్లపై మద్యం సేవించడం.. మోటార్ బైక్‌లు రోడ్లపై అతి వేగంగా నడపడం లాంటివి చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్లపై కేక్‌లు కట్ చేయడం వంటివి నిషేధిస్తున్నట్లు పేర్కొన్నారు.

10 మద్యం బాటిళ్లు స్వాధీనం

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న సంఘటన మండలంలోని పిల్లమేడులో శుక్రవారం చోటు చేసుకుంది. తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర కథనం.. పిల్లమేడు గ్రామానికి చెందిన రామ్మూర్తి(52) మద్యం అక్రమంగా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో తన సిబ్బందితో కలిసి అతని ఇంటిపై ఆకస్మికంగా దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈదాడుల్లో 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని రామ్మూర్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

టెండర్లకు ఆహ్వానం

తిరుపతి లీగల్: తిరుపతి కోర్టు ఆవరణలోని క్యాంటీన్, జిరాక్స్ షాపుల నిర్వహణకు టెండర్లను పిలుస్తున్నట్లు తిరుపతి న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి మురళి శుక్రవారం మీడియాకు తెలిపారు. 2024 జనవరి 17 నుంచి 2025 జనవరి 16వ తేదీ వరకు క్యాంటీన్, జిరాక్స్ షాపుల నిర్వాహణకు 2024 జనవరి మూడో తేదీ నుంచి ఆరో తేదీ వరకు దరఖాస్తులను స్థానిక న్యాయవాదుల అసోసియేషన్ కార్యాలయంలో ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఆంగ్ల సంవత్సరాది వేడుకలు

తిరుచానూరు(చంద్రగిరి): ప్రతి సంవత్సరం లాగే ఆంగ్ల నూతన సంవత్సర వేడుకల కోసం శిల్పారామం తిరుపతి వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో నగర ప్రజలను అలరించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఏఓ ఖాదర్‌వల్లీ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... శాస్త్రీయ నృత్యం, సినీ నృత్యాలు, కామెడీ స్కిట్స్, జానపద కళారూపాలు సాయంత్రం 3 గంటల నుండి ప్రదర్శించడం జరుగుతుందన్నారు. దీంతో పాటు జబర్దస్త్ కామెడీ కళాకారుడు సునామీ సుధాకర్, నెల్లూరుకి చెందిన భూమిక బృందం సినీ నృత్యాలు, విన్నర్ సంస్థ ఆధ్వర్యంలో ఫ్యాషన్ షో, మ్యాజిక్ షో, గాయకుల గాత్రకచ్చేరి తదితర ప్రత్యేక కార్యక్రమాలతో అలరించనున్నట్లు తెలిపారు. నగర ప్రజలకు వినోదాన్ని పంచుతారన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ముఖ్యం



మాట్లాడుతున్న ఏఎంఓ శివశంకర్

సత్యవేడు: విద్యా బోధనలో ప్రభుత్వం కాలానుగుణంగా తీసుకు వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఉపాధ్యాయులు సమగ్ర అవగాహన పెంచుకోవాలని ఏ ఎంఓ శివశంకర్, ఏఎల్ఎస్ కో-ఆర్డినేటర్ శ్రీధర్ కోరారు. సత్యవేడు మండల పరిధిలో దాసుకుప్పం, సత్యవేడులో శుక్రవారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఏఎంఓ, ఎఎల్ఎస్ కో-ఆర్డినేటర్ సందర్శించారు. వారు మాట్లాడుతూ, ఆధునిక విద్యాబోధన పద్ధతులపై నిరంతరం నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాల్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మారిన సిలబస్‌ను ప్యానల్ వైట్ బోర్డు ద్వారా విద్యార్థులకు వివరించాలన్నారు. డి, సి గ్రేడ్‌లోని విద్యార్థులను ఏ-గ్రేడ్‌లోకి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు రవి, ఉష, ప్రధానోపాధ్యాయులు మొహిద్దీన్, మునిమోహన్, భారతి, లలితకుమారి, తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానంపై అవగాహన



సీఆర్‌సీ సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంఈఓ సరస్వతి

వరదయ్యపాళెం: ఉపాధ్యాయులు నూతన విద్యా విధానాన్ని అవగాహన చేసుకుని సరైన రీతిలో విద్యార్థులకు బోధన చేయాలని ఎంఈఓలు సరస్వతి, గున్నయ్య కోరారు. శుక్రవారం స్థానిక గోవర్ధనపురం ఉన్నత పాఠశాలలో సీఆర్‌సీ సమావేశం నిర్వహించారు. విద్యాబోధనలోని కొత్త విధానాలు టీఎల్ఎం పాఠ్య ప్రణాళికలు ఉపయోగించి బోధించాలన్నారు. కార్యక్రమంలో ఆర్పీలు శ్యామ్ సుందర్, కృష్ణ, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, మాధవయ్య పాల్గొన్నారు.

స్కూళ్లలో శ్రీసిటీ పరిశ్రమలతో పచ్చదనం పెంపు



పాఠశాలలో మొక్క నాటుతున్న ఐసాన్ మేనేజింగ్ డైరెక్టర్ అట్సుషి సకాబే

సత్యవేడు: శ్రీ సిటీ ఫౌండేషన్ చొరవతో శ్రీసిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పచ్చదనం పెంపునకు శ్రీసిటీ పరిశ్రమలు చొరవ చూపుతున్నాయి. ఐసాన్ ఆటోమొబైల్ విడిభాగాల తయారీ పరిశ్రమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా రామచంద్రాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. అంతకు ముందు అంగన్‌వాడీ విద్యార్థులు 60 మందికి రూ. 2లక్షలు విలువ చేసే విద్యాసామగ్రి, పరికరాలు అందజేశారు. ఐసాన్ మేనేజింగ్ డైరెక్టర్ అట్సుషి సకాబే మాట్లాడుతూ, పర్యావరణహిత చర్యలకు తమ కంపెనీ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ తన సందేశంలో ఐసాన్ పరిశ్రమ యాజమాన్యాన్ని అభినందించారు.

ఎస్వీ యూనివర్సిటీ వీసీకి సత్కారం



వీసీని సన్మానిస్తున్న వర్సిటీ పరిశోధక విద్యార్థులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ నూతన వీసీగా బాధ్యతలు చేపట్టిన వి.శ్రీకాంత్‌రెడ్డిని వర్సిటీ పరిశోధక విద్యార్థులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ వీసీగా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్‌రెడ్డికి వర్సిటీపై మంచి పట్టు ఉందని అందరినీ కలుపుకొని వర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తారనే నమ్మకం ఉందన్నారు. డాక్టర్ హరికృష్ణ యాదవ్, డాక్టర్ జనార్థన్‌రెడ్డి, డాక్టర్ సుందర్‌రాజారెడ్డి, లోకనాథరెడ్డి, సిద్ధారెడ్డి పాల్గొన్నారు.

తిరుపతి కల్చరల్: ఎస్వీయూ వీసీగా నియమితులైన ప్రొఫెసర్ వి.శ్రీకాంత్‌రెడ్డిని అఫిలియేటెడ్ ప్రైవేట్ డిగ్రీ కాలేజ్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ నేతలు శుక్రవారం వీసీ చాంబర్‌లో ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. అభినందించిన వారిలో అసోసియేషన్ అధ్యక్షుడు బి.శేషారెడ్డి, ప్రధాన కార్యదర్శి పట్నం సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

రవి మరణం మాకు తీరని లోటు

- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: ''హౌసింగ్ బోర్డు రవి నా కుటుంబ సభ్యుడితో సమానం. అతని మరణం నాకు, పార్టీకి తీరని లోటు'' అని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో పట్టణంలోని రివర్‌వ్యూ హోటల్లో శుక్రవారం సంతాప సభ ఏర్పాటు చేశారు. రవి చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ తాను కష్టాల్లో ఉన్నప్పుడు, తనకు పదవులు లేనప్పుడు తోడుగా ఉన్న రవికిరణ్ నేడు లేకపోవడం తీరని లోటన్నారు. వ్యక్తిగత సమస్యలతో రవికిరణ్ ఆత్మహత్య చేసుకున్నాడని అతని కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, జనార్దన్‌రావ్ పవార్, కృష్ణకుమార్, గుమ్మడి బాలకృష్ణయ్య, లోకేష్‌యాదవ్, పగడాల రాజు, సిరాజ్‌బాషా, ముత్యాల పార్థసారథి, సురేష్, నంద, మార్కెట్ యార్డు చైర్మన్ మధు, సుమతి, కొల్లూరు హరినాయుడు, పాండు తదితరులు పాల్గొన్నారు.

శవ రాజకీయాలొద్దు

బొజ్జల సుధీర్‌రెడ్డి ఇకనైనా శవరాజకీయాలు మానుకోకపోతే ప్రజలే బుద్ధిచెబుతారని ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. సుధీర్‌రెడ్డి అమెరికాలో రాజకీయాలుకు పనికివస్తావు కానీ ఇక్కడ వీడియోలతో రాజకీయాలు చేయడం దురదృష్టకరమన్నారు. అనంతరం గుమ్మడి బాలకృష్ణయ్య మాట్లాడుతూ ఒకరిపై ఆరోపణలు చేసే ముందు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిజాలు తెలుసుకోవడం మంచిపద్ధతని హితవుపలికారు. రవి కిరణ్ మరణాన్ని రాజకీయం చేయడంసరికాదన్నారు.